సందడిగా పాఠశాల క్రీడోత్సవం

రసూల్‌పురా: పికెట్ కేంద్రీయ విద్యాలయ సంఘటన్ పాఠశాల వార్షిక క్రీడోత్సవం పాఠశాల ఆవరణలో బుధవారం ఉత్సాహంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాఠశాల హెచ్‌ఎం రూపేందర్ సింగ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఫుట్‌బాల్, వాలీబాల్, టగ్‌ఆఫ్ వార్ తదితర క్రీడలతోపాటు సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఉపాధ్యాయులు వర్తీనియా సుందర్ రాజ్, హరిత, అపర్ణ ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప పడిపూజ



అయ్యప్ప పడిపూజలో పాల్గొన్న నాయకులు, భక్తులు

లాలాపేట: తార్నాక డివిజన్ లాలాపేట ఇందిరా నగర్‌లో బుధవారం అయ్యప్ప పడిపూజా మహోత్సవం ఘనంగా నిర్వహించారు. గణపతి పూజతో ప్రారంభమైన అయ్యప్ప పడిపూజలో అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. అయ్యప్ప భజన గీతాల ఆలాపనతో అయ్యప్ప భక్తులు భక్తిపారవశ్యంలో మునిగితేలారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు మల్లికార్జున్, సునీల్ ముదిరాజ్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అమిత్‌షాను మంత్రి వర్గం నుంచి తొలగించాలి

లాలాపేట: నరేంద్రమోదీకి అంబేద్కర్‌పై గౌరవం ఉంటే వెంటనే అమిత్‌షాను కేంద్ర మంత్రి వర్గం నుంచి తొలగించాలనీ మాల ఐక్యవేదిక చైర్మెన్ సుద్దాల సురేష్, స్వేరోస్ నగర కార్యదర్శి కుమార్ షాను డిమాండ్ చేశారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పార్లమెంట్ సాక్షిగా భారత రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్‌ను అవమానపరిచేలా మాట్లాడటాన్ని యావత్ దళిత బహుజన వర్గాలు తీవ్రంగా ఖండిస్తున్నాయన్నారు. ఇలాంటి వ్యాఖ్యలతో అమిత్ షా దేశంలోని దళిత జాతిని అవమానించారని పేర్కొన్నారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి



సికింద్రాబాద్: పట్టాలు దాటుతుండగా ప్రమాదవశాత్తు రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన సికింద్రాబాద్ జీఆర్పీ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన మేరకు...ఫతేనగర్ రైల్వే స్టేషన్ సమీపంలోని పట్టాలపై మంగళవారం సాయంత్రం 6.30 గంటల సమయంలో సుమారు 45 సంవత్సరాల గుర్తు తెలియని వ్యక్తి నడుచుకుంటూ వెళ్తున్నాడు. ప్రమాదవశాత్తు రైలు ఢీకొట్టడంతో తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



సనత్‌నగర్: గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని సనత్‌నగర్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు తెలిపిన వివరాల ప్రకారం..భరత్‌నగర్‌లోని సంగీతా మొబైల్ షాప్ ముందు ఫుట్‌పాత్‌పై గుర్తుతెలియని వ్యక్తి చలనం లేకుండా పడి ఉన్నాడని స్థానికులు 108 వాహన సిబ్బందికి ఫోన్ చేశారు. వారు వచ్చి పరీక్షించగా అప్పటికే అతను మృతి చెంది నట్లు నిర్ధారించారు. అయితే గత కొంతకాలంగా ఫుట్‌పాత్‌పై పడుకుంటూ యాచక వృత్తి చేస్తున్నట్లుగా స్థానికులు పోలీసులకు తెలియజేశారు.

లగచర్ల బాధితులకు న్యాయం జరగాలి

ఉస్మానియా యూనివర్సిటీ: లగచర్ల గిరిజన రైతులకు బేడీలు వేయడం దారుణమని బీఆర్‌ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షులు తుంగ బాలు ఆవేదన వ్యక్తం చేశారు. ఓయూ క్యాంపస్ లా కాలేజీలోని డా.బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి లగచర్ల రైతులకు న్యాయం జరగాలని వినతి పత్రం అందజేశారు. రైతుల భూమి లాక్కోవడం, కేసులు పెట్టి బేడీలు వేసి అరెస్టులు చేయడం, జైల్‌లో నిర్బంధించి థర్డ్ డిగ్రీ ప్రయోగించడం దారుణమన్నారు. కార్యక్రమంలో కిషోర్‌గౌడ్, గదరాజు చందు, జంగయ్య, రాజేస్‌నాయక్, శివకుమార్, నాగరాజు, మిథున్ తదితరులు పాల్గొన్నారు.

మురుగు సమస్య ఉండదిక

తార్నాకలో 80 శాతం డీ సిల్టింగ్ పనులు పూర్తి



మాణికేశ్వర్‌నగర్‌లో మ్యాన్ హోళ్ల నుంచి పూడిక తీస్తున్న జలమండలి సిబ్బంది

లాలాపేట : మహా నగరంలో నిత్యం ఏదో ఒక చోట మ్యాన్ హోల్‌లు పొంగి రోడ్లపై మురుగు నీరు పారుతూనే ఉంటుంది.ఈ సమస్యలకు చెక్ పెట్టేందుకు జలమండలి ఎండీ అశోక్ కుమార్ సారథ్యంలో 90 రోజుల డీ సిల్టింగ్ పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని రూపొందించారు. గత అక్టోబర్ 2న గాంధీ జయంతి రోజున తార్నాకలో డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్‌రెడ్డి ఈ పనులను ప్రారంభించారు. తార్నాక, మాణికేశ్వర్‌నగర్, మెట్టుగూడ, రవీంద్రనగర్ తదితర ప్రాంతాల్లో జలమండలి సిబ్బంది మ్యాన్ హోళ్లలో పేరుకుపోయిన పూడికతీత పనులు కొనసాగిస్తున్నారు. ఇప్పటి వరకు 7 కిలో మీటర్ల పొడవైన సివరేజ్ పైపులైన్‌ల నుంచి 500 మ్యాన్ హోళ్లలో పూడిక తీసినట్లు జలమండలి అధికారులు తెలియజేశారు.

ఫిర్యాదులు తగ్గాయి



అక్టోబర్ 2 న ప్రారంభమైన పూడిక తీత కార్యక్రమం జనవరి 2 వరకు కొనసాగుతుంది. ఈ కార్యక్రమం సత్ఫలితాలనిస్తోంది. ఇప్పటికే దాదాపు 80 శాతం పనులు పూర్తయ్యాయి. మురుగు నీటి ప్రవాహం సమస్యపై ప్రజల నుంచి ఫిర్యాదులు సైతం తగ్గాయి. పూడిక తీతపనులు ప్రస్తుతం పెద్ద ఎత్తున కొనసాగుతున్నాయి.

– మహ్మద్ ఆసిఫ్ అలీ, తార్నాక జలమండలి మెనేజర్.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు



క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న కార్పొరేటర్ సామల హేమ



చిలకలగూడ: డివిజన్‌లోని సీఎస్‌ఐ చర్చిలో బుధవారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాస్టర్ ప్రసన్న కుమార్, జాక్విలిన్ పూర్ణిమ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలకు సీతాఫల్‌మండి డివిజన్ కార్పొరేటర్ సామల హేమ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఏసు క్రీస్తు చూపిన ప్రేమ మార్గంలో అందరూ నడిచే విధంగా ప్రయత్నించాలని కార్పొరేటర్ పేర్కొన్నారు. అనంతరం, పాస్టర్స్, కమిటీ సభ్యుల సమక్షంలో క్రిస్మస్ కేక్‌ను కట్ చేసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. వేడుకల్లో కమిటీ సభ్యులు జోనా విన్సెంట్, సుధాకర్, విల్సన్, బెంబిమన్ జ్యోతి, గుంటి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అడ్డగుట్ట: సికింద్రాబాద్‌లోని హైద్రాబాద్ భవన్‌లో బుధవారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. హైద్రాబాద్ డివిజన్ అకౌంట్స్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. మతసామరస్యానికి ప్రతీకగా క్రిస్మస్ వేడుకలు నిర్వహించుకోవాలని పలువురు అధికారులు సూచించారు. కార్యక్రమంలో సీనియర్ డీఎఫ్‌ఎమ్‌లు రాజా దురాయ్, జేసుదాస్, సలాన్ సంగ, ఏడీఎఫ్‌ఎమ్ రమణ, ఎంప్లాయిస్ సంఘ్ ఏజీఎస్ షేక్ రవూఫ్, హైద్రాబాద్ డివిజన్ అకౌంట్స్ విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా ధనుర్మాసోత్సవాలు



ప్రత్యేక అలంకరణలో శ్రీవారు..

సనత్‌నగర్: ధనుర్మాసోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. సనత్‌నగర్ శ్రీహనుమాన్ దేవాలయ ప్రాంగణంలోని శ్రీకళ్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న ఉత్సవాల్లో భాగంగా స్వామివారికి సుప్రభాత సేవ, గోత్రనామాలతో ప్రత్యేక నిత్యార్చన, తిరుప్పావై పాశురాల పారాయణం, విష్ణు సహస్ర నామ స్తోత్ర పారాయణం, స్వామివారికి నైవేద్యం, హారతి, మంత్ర పుష్పం, తీర్థ ప్రసాద గోష్ఠి తదితర కార్యక్రమాలు జరిగాయి. ఈఓ సత్యనారాయణ పర్యవేక్షణలో ప్రధానార్చకులు పరాశరం రవీంద్రాచార్యుల ఆధ్వర్యంలో విశేష పూజలు కొనసాగుతున్నాయి. కార్యక్రమంలో ఆలయ అధికారి కాటం శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా డంకిట్ బాస్కెట్‌బాల్ పోటీలు



డంకిట్ బాస్కెట్‌బాల్ టోర్నమెంట్‌లో సత్తా చాటిన క్రీడాకారులు

సనత్‌నగర్: డంకిట్ బాస్కెట్‌బాల్ అకాడమీ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు జరిగిన టోర్నమెంట్‌లో క్రీడాకారులు ఉత్సాంగా పాల్గొన్నారు. వయస్సులను బట్టి ఆయా కేటగిరిలలో నిర్వహించిన ఈ టోర్నమెంట్‌కు నగర వ్యాప్తంగా 90కి పైగా టీమ్‌లు హాజరయ్యాయి. అండర్–12, అండర్–14, అండర్–16, అండర్–18, అండర్–21 లలో ఓపెన్ మెన్, ఓపెన్ మహిళలు, మిక్స్ కేటగిరిలలో ఈ పోటీలు ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగాయి. డంకిట్ బాస్కెట్ బాల్ అకాడమీ టీమ్ అండర్–18 ఓపెన్ మెన్, మిక్స్ కేటగిరిలలో మొదటి స్థానాన్ని కైవసం చేసుకుంది. ఈ సందర్భంగా అకాడమీ ఫౌండర్ అండ్ హెడ్ కోచ్ నిఖిల్ మాట్లాడుతూ 90 టీమ్‌లు, 500 మంది క్రీడాకారులు ఈ టోర్నమెంట్‌లో పాల్గొని సత్తా చాటారన్నారు.

రాష్ట్ర వ్యాప్తంగా పూలే దంపతుల విగ్రహాలను ఏర్పాటు చేస్తాం



పోస్టర్‌ను విడుదల చేస్తున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్ర వ్యాప్తంగా పూలే దంపతుల విగ్రహాలను ఏర్పాటు చేస్తామని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. బుధవారం ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఎదుట సావిత్రి బాయి పూలే జయంతి ఉత్సవాల పోస్టర్‌ను బీసీ నాయకులతో కలసి శ్రీనివాస్‌గౌడ్ ఆవిష్కరించారు. తెలంగాణ పేరుతో ఎలాంటి రూపం, చరిత్రలేని ఊహాజనితమైన తల్లుల విగ్రహాలు బీసీలకు అవసరం లేదన్నారు.జనవరి 3న ఉదయం 11 గంటలకు జరిగే సావిత్రి బాయి పూలే 194వ రాష్ట్ర స్థాయి జయంతి ఉత్సవాలలో పార్టీలకు అతీతంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. దేశంలో మహిళలకు విద్యను నేర్పిన గొప్ప వ్యక్తి సావిత్రి బాయి పూలే పేరును స్కిల్ యూనివర్సిటీకి పెట్టాలని, చారిత్రక కట్టడాలకు, జాతీయ రహదారులకు, ప్రాజెక్టులకు, విమానశ్రయాలకు పూలే దంపతుల పేర్లు పెట్టాలని, కేంద్ర ప్రభుత్వం భారత రత్న అవార్డులను ప్రదానం చేసి గౌరవించాలని జాజుల శ్రీనివాస్‌గౌడ్ కోరారు. కార్యక్రమంలో బీసీ మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు, సావిత్రిబాయి పూలే జయంతి ఉత్సవ కమిటీ చైర్మన్ బి.మని మంజరి, బీసీ నేత జాజుల లింగంగౌడ్, మహిళా నేతలు పాల్గొన్నారు.



ఏసీబీ కార్యాలయం సీసీరోడ్డును తవ్విన దృశ్యం

యథేచ్ఛగా సీసీ రోడ్డు తవ్వకం

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నంబర్–12లోని ఎమ్మెల్యే కాలనీ ఏసీబీ కార్యాలయం రోడ్డును ఇటీవలే లక్షల రూపాయలు వెచ్చించి సీసీగా నిర్మించారు. ఇంకా రోడ్డు పనులు ప్రారంభం కాకముందే తెలంగాణ క్రాఫ్ట్స్ కౌన్సిల్ ముందు ఓ ఇంటి యజమాని సీసీ రోడ్డును దర్జాగా తవ్వి పైపు లైన్ పని మొదలు పెట్టాడు. ఇప్పటికైనా సంబంధిత జీహెచ్‌ఎంసీ సర్కిల్ 18 ఇంజినీర్లు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

పెన్షన్ మంజూరులో జాప్యాన్ని నివారించాలి

అడ్డగుట్ట: రైల్వేలో సెకండరీ పెన్షన్ మంజూరు చేయటంలో జరుగుతున్న జాప్యాన్ని నివారించేందుకు చర్యలు చేపట్టాలని ఎస్‌ఎఫ్‌ఐఆర్, దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ ప్రధాన కార్యదర్శి మర్రి రాఘవయ్య అధికారులను కోరారు. బుధవారం సికింద్రాబాద్‌లోని ఎంప్లాయిస్ సంఘ్ కార్యాలయంలో మర్రి రాఘవయ్యను సీ. రామ్మోహన్ అనే వ్యక్తి మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సత్కరించారు. శేషగిరిరావు అనే వ్యక్తి విజయనగరంలో పార్సిల్ సూపర్‌వైజర్‌గా విధులు నిర్వహించి పదవీ విరమణ చేసి 1996లో మరణించాడు, భార్య 2014లో మరణించారు. వారికి చదువుకోలేని అవివాహిత కుమార్తె ఉంది. ఆమెకు ఫ్యామిలీ సెకండరీ పెన్షన్ కోసం పదేళ్ల క్రితం దరఖాస్తు చేసుకోగా, మంజూరుకై తీవ్ర జాప్యం జరిగింది. దీంతో మర్రి రాఘవయ్యను కలిసి విన్నవించారు. తక్షణమే స్పందించిన ఆయన సంబంధిత అధికారులతో మాట్లాడి పెన్షన్ మంజూరుకు చర్యలు చేపట్టారు. దీంతో పదేళ్ల సమస్యకు పరిష్కారం లభించడంలో దరఖాస్తుదారు కుటుంబసభ్యుడు రామ్మోహన్ మర్రి రాఘవయ్యను కలిసి ధన్యవాదాలు తెలిపారు.

నేడు మజ్దూర్ యూనియన్ విజయోత్సవ ర్యాలీ

అడ్డగుట్ట: రైల్వే ట్రేడ్ యూనియన్ ఎన్నికల్లో అత్యధిక ఓట్లతో విజయం సాధించిన మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో నేడు భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు నాయకులు ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 10.30 గంటలకు సికింద్రాబాద్‌లోని దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ కార్యాలయం నుంచి రైల్ నిలయం వరకు ర్యాలీ నిర్వహించనున్నారని తెలిపారు. ముఖ్యఅతిథులుగా ఆల్ ఇండియా రైల్వేమెన్ ఫెడరేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి శివగోపాల్ మిశ్రా, కోశాధికారి, మజ్దూర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి శంకర్‌రావులు పాల్గొంటున్నారని చెప్పారు.

గంజాయి విక్రయిస్తున్న ముగ్గురి అరెస్టు



బంజారాహిల్స్: గంజాయి విక్రయిస్తున్న ముగ్గురిని బంజారాహిల్స్ పోలీసులు బుధవారం అరెస్టు చేశా రు. వివరాల్లోకి వెళ్తే.. బంజారాహిల్స్ రోడ్డునంబర్–2 లోని ఇందిరానగర్ రాజీవ్‌గాంధీ విగ్రహం లైన్‌లో ముగ్గురు యువకులు గంజాయి విక్రయిస్తున్నట్లుగా సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకున్నారు. నిందితుల నుంచి రూ.20 వేల విలువైన 2 కిలోల గంజాయిని, బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. ప్రేమ్‌కుమార్, బానోత్ లక్ష్మణ్‌నాయక్, లఖన్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. శంకర్ అనే మరో వ్యక్తి పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో కంటి అద్దాల పంపిణీ



కంటి అద్దాలు పంపిణీ చేస్తున్న రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లీహిల్స్ ప్రతినిధులు

చిలకలగూడ: కుల, మత, రాజకీయాలకు అతీతంగా సేవ చేసే సంస్థ రోటరీ అని డీజీఈ (డిస్ట్రిక్ట్ గవర్నర్ ఎలక్టెడ్) డాక్టర్ రాం ప్రసాద్, రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లీహిల్స్ అధ్యక్షులు బాలకోటి రెడ్డిలు అన్నారు. చిలకలగూడలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లీహిల్స్ ఆధ్వర్యంలో ఈ నెల 1న కంటి పరీక్షలు నిర్వహించారు. అందులో భాగంగా కంటి సమస్యలు ఉన్నటువంటి 144 మందికి కంటి అద్దాలు బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథులుగా హాజరైన డాక్టర్ రాం ప్రసాద్, బాలకోటి రెడ్డిలు మాట్లాడుతూ క్రమం తప్పకుండా కంటి పరీక్షలు చేయించుకోవడం ద్వారా కంటి సమస్యలు తలెత్తకుండా ఉంటాయన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ రాజాకృష్ణ, పుష్పగిరి కంటి ఆస్పత్రి ఇంచార్జ్ డాక్టర్ ఆనంద్, అరుణ్‌కుమార్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రిని తనిఖీ చేసిన వైద్య విధానపరిషత్ కమిషనర్



చికిత్స పొందుతున్న మహిళతో మాట్లాడిన కమిషనర్ అజయ్‌కుమార్

అమీర్‌పేట: అమీర్‌పేట ప్రభుత్వ ఆసుపత్రికి ఎలాంటి వైద్య పరికరాలు అవసరమున్నా తనకు నివేదికలు పంపాలని తెలంగాణ వైద్య విధానపరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్‌కుమార్ తెలిపారు. బుధవారం అమీర్‌పేటలోని 50 పడకల ప్రభుత్వ ఆసుపత్రిని తనిఖీ చేశారు.ఓపీ, ఆపరేషన్ థియేటర్ పరిశీలించి చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడారు. రోగుల రద్దీ బాగా పెరిగిందని, ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి ఆసుపత్రి విస్తరణకు చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆసుపత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్ రహుఫ్,ఆసుపత్రి వైద్యులు,సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లోని సమస్యలు పరిష్కరించండి



సీడీపీఓ స్వప్నకు వినతిపత్రం సమర్పిస్తున్న ప్రతినిధులు

అడ్డగుట్ట: మారేడుపల్లి మండల పరిధిలోని అంగన్వాడీ కేంద్రాల్లోని సమస్యలపై బాలల హక్కుల పరిరక్షణ వేదిక, తల్లుల సంఘం ప్రతినిధులు బుధవారం సీడీపీఓ స్వప్నను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండల పరిధిలోని చాలా వరకు అంగన్‌వాడీ కేంద్రాల్లో సరైన వసతులు లేక గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ముఖ్యంగా వాటర్, కరెంట్ సమస్యలతో పాటు అద్దె ఇళ్లలో కొనసాగుతున్న భవనాలకు అద్దెలు కూడా సమయానికి అందడం లేదన్నారు. తుకారాంగేట్ గడ్డమీది బస్తీలోని అంగన్‌వాడీ సెంటర్లో టీచర్, ఆయా ఇద్దరూ లేకపోవడంతో పక్క బస్తీలోని కేంద్రాల నుంచి వారానికి ఒక ఆయా వచ్చి కేంద్రంలో తల్లులు, గర్భిణీలు, పిల్లలకు భోజనం ఇస్తున్నారని వెల్లడించారు. పిల్లలకు వచ్చే బాలామృతం, గుడ్లు కూడా సమయానికి అందడం లేదని, ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. సీడీపీఓకు వినతిపత్రం సమర్పించిన వారిలో మదర్స్ అసోసియేషన్ రాష్ట్ర కన్వీనర్ జీ. భాగ్యలక్ష్మి, సీఆర్పీఎఫ్ జిల్లా కోకన్వీనర్ రమాదేవి, మండల కన్వీనర్ ప్రవీణ్, సంతోష్, ఎంవి. ఫౌండేషన్ ఆర్గనైజర్లు ఏ. సువర్ణ, బి. భాగ్య తదితరులు ఉన్నారు.



బాబోయ్.. ట్రాఫిక్ జామ్ !

లాలాపేట రహదారిలో తీవ్రమైన ట్రాఫిక్ జాం

లాలాపేట: తార్నాక, లాలాపేట ప్రధాన రహదారిలో రోజు రోజుకూ వాహనాల రద్దీ ఎక్కువవుతోంది. వాహనాల రద్దీకి అనుగుణంగా సరిపడా రహదారి లేకపోవడంతో రోడ్లపై వాహనాలు బారులు తీరుతున్నాయి. మరో వైపు వ్యాపారులు రోడ్డును పూర్తిగా అక్రమించేస్తున్నారు. ఇక ఉదయం, సాయంత్రం వేళల్లో ట్రాఫిక్ సమస్య మరింత జటిలంగా మారుతోంది. పాఠశాలలకు, కళాశాలలకు, కార్యాలయాలకు వెళ్లే వారు సకాలంలో చేరుకోలేకపోతున్నారు. ఈ మార్గం గుండా వెళుతూ మౌలిలోని ఆన్‌లైన్ పరీక్ష కేంద్రానికి చేరుకోలేక లాలాపేట ట్రాఫిక్‌లో నిలిచిపోయి కొందరు అభ్యర్థులు గురుకుల పరీక్షలకు హాజరు కాలేకపోయిన సందర్భాలు ఉన్నాయి. లాలాపేట రోడ్డు విస్తరణ చేయకపోవడం వల్ల ట్రాఫిక్ సమస్యతో వాహనదారులు నిత్యం ఇబ్బంది పడుతున్నారు. తరచుగా ఈ మార్గంలో వెళుతున్న ఎమర్జెన్సీ అంబులెన్స్ వాహనాలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. తాజాగా బుధవారం రాత్రి లాలాపేట రహదారిలో 108 అంబులెన్స్ ట్రాఫిక్‌లో చిక్కుకుంది. చాలా సేపటికి గానీ ట్రాఫిక్ క్లియర్ కాలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి లాలాపేట ప్రధాన రహదారిలో నెలకొన్న ట్రాఫిక్ సమస్యను నివారించాలనీ సామాజిక కార్యకర్త నేతికార్ మహేశ్, లాలాపేట వాసులు కోరుతున్నారు.

కూరగాయల ధరలు..

సనత్‌నగర్: ఎర్రగడ్డ రైతుబజార్‌లో (కిలో..రూపాయల్లో..) టమాటా.15, నల్లవంకాయ 23, పొడుగు వంకాయ 23, బెండకాయ 55, పచ్చిమిర్చి 31, బజ్జీమిర్చి 28, క్యాప్సికమ్ 55, పచ్చకాకర 38, పందిరి బీర 52, క్యాబేజీ 18, క్యారెట్ 33, దొండ 40, గుండుబీన్స్ 45, గింజ చిక్కుడు 50, గోకరకాయ 35, కీర 28, దోసకాయ 18, బీట్‌రూట్ 28, ఉల్లిగడ్డ 45, ఆలుగడ్డ 28, చామగడ్డ 35, మొరంగడ్డ 35, కందగడ్డ 50, సొరకాయ 13, పొట్లకాయ 18, అరటికాయ 9,

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి,
వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు
మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220378
9912220379